

'పారిశ్రామిక కేంద్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా'

ఉండి: ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ పారిశ్రామిక శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఎన్ఆర్‌పి అగ్రహారంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ నాగరాణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు, నాగరాణి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగం కంటే ఇతర రంగాలలో మార్పులు మొదలై టెక్నాలజీ అభివృద్ధి చెందిందని, దీనివల్ల ఐటిఐ చదివిన విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు పెరుగుతాయని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో కొన్ని ట్రేడ్లే పరిమితమై ఉండగా, త్వరలో మరిన్ని ట్రేడ్లను విస్తరింపచేసి ఐటిఐ చదవాలి అనుకునే ప్రతి విద్యార్థికి అందుబాటులోకి అన్ని ట్రేడ్లను తీసుకొస్తామని వారు వివరించారు. కళాశాల చైర్మన్ సామంతపూడి బాలకృష్ణం రాజు, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు, టిడిపి మండల అధ్యక్షులు నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

రక్త పరీక్షా కేంద్రాల్లో.. నిబంధనలు గాలికి..!

- ఏలూరు జిల్లాలో అనుమతి పొందిన వంద ల్యాబ్‌లు
- పశ్చిమలోనే దాదాపు అదే పరిస్థితి
- ల్యాబ్‌ల వద్ద కానరాని ధరల పట్టికలు
- కొరవడిన ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీలు
- అనుమతులు లేని ల్యాబ్‌లు కొనసాగుతున్నట్లు చర్చ
- రక్త పరీక్షా కేంద్రాల్లో సిబ్బంది అర్హతపై అనుమానాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రక్త పరీక్షా కేంద్రాల్లో (ల్యాబ్స్) నిబంధనలు అమలు కాని పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ల్యాబ్ యాజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. ప్రజల రోగనిర్ధారణలో అత్యంత కీలకంగా ఉన్న రక్త పరీక్షా కేంద్రాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో వంద రక్త పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. పశ్చిమలోనూ దాదాపు అదే విధంగా ఉన్నాయి. రెండు జిల్లాల్లోనూ రక్తపరీక్షా కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని చెప్పొచ్చు. జ్వరం నుంచి ఏ సమస్య వచ్చినా రక్తపరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాతే డాక్టర్లు వైద్యం అందిస్తారు. రక్త పరీక్షా కేంద్రాల ఏర్పాటు, వాటి అమలుపై అనేక నిబంధనలు ఉన్నాయి. ఆరోగ్యశాఖ విధించిన నిబంధనలను రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోని పరిస్థితి కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి రక్త పరీక్షా కేంద్రం వద్ద ఏ టెస్ట్‌కు ఎంత ఫీజు అనేది పట్టిక రూపంలో ఏర్పాటు చేయాలి. దాని ప్రకారమే రోగుల నుంచి వసూలు చేయాలి. ఏలూరు పట్టణంతోపాటు, ఏ ఒక్క రక్త పరీక్షా కేంద్రం వద్ద ధరల పట్టిక లేదంటే అతిశయోక్తికాదు. ధరల పట్టికపై రోగులు అడిగినా సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. దీంతో రక్త పరీక్షలకు ఇష్టానుసారం ధరలు వసూలు చేస్తున్నారు. ఒకే పరీక్షకు ఒక ల్యాబ్‌లో ఒక ధర, మరో ల్యాబ్‌లో ఇంకో ధర ఉంటుంది. సుగర్ నిర్ధారణ టెస్ట్‌కు ఒకచోట రూ.50 తీసుకుంటే, మరో ల్యాబ్‌లో రూ.వంద, ఇంకో ల్యాబ్‌లో ఇంకోవిధంగా వసూలు చేస్తున్నారు. విటమిన్ డి, బి-12 వంటి పరీక్షలకు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. డెంగీ నిర్ధారణ పరీక్ష ప్రయివేటు ల్యాబ్‌లో చేసే అవకాశం లేదు. కాని చాలా ల్యాబ్‌ల్లో స్థానిక వైద్యులతో కుమ్మక్కై డెంగీ ఉందంటూ రోగులను భయపెడుతున్న



పరిస్థితులు సైతం కొనసాగుతున్నాయి. పలు ఆసుపత్రులతో రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఏకమవుతున్నారు. ప్రతి పరీక్షకు ఆయా ఆసుపత్రులకు పర్సంటేజీ రూపంలో కమీషన్లు ల్యాబ్ నిర్వాహకులు ఇస్తుంటారు. ఈ కమీషన్ 40 నుంచి 50 శాతం వరకూ ఉంటుందని తెలుస్తోంది. దీంతో రోగుల నుంచి భారీగా దోపిడీ చేస్తున్న పరిస్థితి నెలకొంది. రక్త పరీక్షలకు సంబంధించిన ధరల నిర్ణయంపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు అసలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ల్యాబ్ నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా తయారవుతోంది. రక్త పరీక్షా కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు సరిగ్గా అమలుకాకపోవడంతో రోగులు భారీ దోపిడీకి గురికావడంతోపాటు, అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.


కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

రక్తపరీక్షా కేంద్రాలను ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాలి. అసలు తనిఖీలు జరుగుతున్నాయా అన్న అనుమానాలు నెలకొన్నాయి. ఏదైనా సమస్య బయటపడినప్పుడు మాత్రం హడావుడి చేయడం, తర్వాత వదిలేయడం ఆరోగ్యశాఖ అధికారులకు పరిపాటిగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ప్రతి ఐదేళ్లకోసారి రిజిస్టర్ అయిన రక్తపరీక్షా కేంద్రాలకు సంబంధించి రెన్యువల్ చేయించుకోవాలి. నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రక్తపరీక్షా కేంద్రాలు చాలా ఉన్నట్లు జనాల్లో చర్చ సాగుతోంది. ఒకపేరు మీద పరీక్షా కేంద్రం రిజిస్టర్ చేస్తూ మరొకరు నిర్వహిస్తున్న పరిస్థితులు సైతం ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులతో ఆరోగ్యశాఖలోని అధికారులు కుమ్మక్కై పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రక్తపరీక్షా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది అర్హతలపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. రక్త పరీక్షా కేంద్రాలు అంటేనే సంబంధించిన డిప్లొమా, బిఎస్‌సి ల్యాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులు చదివిన వారు ఉండాలి. చాలా రక్త పరీక్షా కేంద్రాల్లో అర్హత లేనివారిని తక్కువ జీతాలకు నియమిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల కనీస పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అధికారుల తనిఖీలు లేకపోవడంతో ధరల పట్టిక నుంచి, సిబ్బంది నియామకం వరకూ రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు రక్తపరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించకపోతే రోగులు మరిన్ని ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఆప్కాస్‌ను కొనసాగించాలని ఆందోళన

ప్రజాశక్తి - తణుకు

పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించి ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించడం అన్యాయమన్నారు. 25 సంవత్సరాల నుండి ఎవరూ అందించని సేవలు మున్సిపల్ కార్మికులు అందిస్తున్నారని తెలిపారు. విశాఖ హుద్‌హుద్ తుపాన్, కరోనా, విజయవాడ వరదలు వంటి ప్రాంతాల్లో ప్రాణాలకు తెగించి కార్మికులు పనిచేశారన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా చాలీచాలని వేతనాలు, అరకొర సౌకర్యాలతో మున్సిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు,సిఐటియు నేతలు

ఆప్కాస్‌కు ముందు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండేవని మళ్లీ అలాంటి పరిస్థితికి కార్మికులను నెట్టడం ఏంటని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు గౌరవ వేతనాలు పెంచుకొంటున్నప్పుడు కార్మికుల వేతనాలు ఎందుకు పెంచరని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.ఆదినారాయణబాబు, ఉండ్రాజవరపు శ్రీను, గెల్లా విజయకుమార్, డి.సత్యనారాయణ, రాజు, శ్రీదేవి, సురేష్, ప్రసాద్, దువ్వాపు గంగాధర్, మందులయ్య, రవి, దాసు, రాజమ్మ, అనంతలక్ష్మి, కృష్ణారావు, రమేష్ పాల్గొన్నారు.

ఉండిని మోడల్ నియోజకవర్గంగా మారుస్తా

విద్య, వైద్యం, భద్రత ప్రధానం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ఉండి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తయారుచేస్తానని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. గత ప్రభుత్వ సమయంలో అయిభీమవరంలో కొంతమేర నిర్మాణం జరిగి నిలిచిపోయిన రైతు భరోసా కేంద్రం భవనం నిర్మాణం ఇటీవల పూర్తిచేశారు. ఈ భవనాన్ని గురువారం రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. ఇదే భవనంలో ఇదే రోజునుంచి ఉపయోగంలోకి తీసుకురానున్న ధాన్యం కొనుగోలు యంత్రాలను ఆయన పరిశీలించారు. తేమ యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచి గాలి సామ్రాజ్యం అధ్యక్షతన జరిగిన సభలో రఘురామకృష్ణంరాజు మాట్లాడారు. విద్య, వైద్యం, భద్రత అంశాలకు తాను తొలి ప్రాధాన్యతను ఇస్తానన్నారు. ముందుగా విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రానున్న 45 రోజుల నుంచి 60 రోజుల మధ్యలో మండలంలోని మొత్తం జిల్లా పరిషత్ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్లే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ వేసవి చివరికి రెండు పాఠశాలలోనూ తిరిగి పాఠశాలలు ప్రారంభమైన తర్వాత మిగిలినవి పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే కెనరా బ్యాంక్ సహకారంతో ఆకివీడు, దొరగారి చెరువు వద్దా యోగా, ధ్యాన కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నాలు పూర్తయ్యాయని తెలిపారు. విద్యా కేంద్రాల అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలను సంపూర్ణ స్థాయిలో విద్యార్థుల మేధా నిలయంగా మారుస్తామన్నారు.

వైద్య రంగానికి ప్రాధాన్యత : వైద్యరంగంలో ముందుగా ఆరోగ్య రంగాన్ని ప్రధానంగా తీసుకున్నామని తెలిపారు. ఈ ఆరోగ్య సంరక్షణ స్వభావంగా అత్యంత ప్రధానమైనదని, కలుషిత నీటి నుంచి ప్రజలను కాపాడుతామన్నారు. అందుకోసం ఉన్న చెరువులు, కాలువలు, పంట కాలువల గట్లపైన ఉన్న ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ఇప్పటికే చాలా చోట్ల తొలగించామని అన్నారు. నీరు కాలుష్యం కాకుండా ఆపుతామన్నారు. అయితే అప్పటికి నీటి కాలుష్యం పూర్తి కాకపోవడం జరుగుతుందని, అందువల్ల ప్రతి గ్రామానికి ఒక మైక్రో ఫిల్టర్‌న్యూ ఏర్పాటు చేస్తామన్నారు. దుంపగడప కళాశాలలతో పాటు మరో 25 గ్రామాలకు కెనరా బ్యాంక్ సహాయంతో మైక్రో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాటితోపాటు స్థానికంగా ఆయా



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ, జెసి

గ్రామాల్లో ఉన్న దాతలను సహకరించమని కోరుతున్నామన్నారు. రెండు నెలల లోపు ప్రస్తుతం ప్రజలు మంచినీటి కన్నా అధికంగా 250 పిపిఎం కలిగేలా మైక్రో ఫిల్టర్‌ల ద్వారా తాగునీరు అందించే చర్యలు తీసుకుంటామన్నారు. వ్యక్తిగత భద్రతకు నియోజకవర్గంలోని నేర అంశాలను ముందుగా అరికట్టాలన్నారు. పాఠశాలలకు, యువతకు గంజాయి వంటి మత్తు పదార్థాలు సరఫరా కాకుండా హై స్కూల్ స్థాయి నుంచి అన్ని విద్యాసంస్థలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జెసి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు 48 గంటల్లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. గత సంవత్సరం సుమారు 72 వేల మంది నుంచి ధాన్యం కనుగోలు చేశామని, ఈ సంవత్సరం కనీసం 75 వేల మంది నుంచి ఆరు లక్షల టన్నులు కొనుగోలు చేయాలని అంచనా వేస్తున్నామన్నారు. తేమ చూపించే మిషన్లు, ప్రభుత్వం వాడే కంపెనీలే రైస్ మిల్లులు, ఇతర కొనుగోలుదారులు కూడా వినియోగించాలన్నారు. అవసరమైతే ఇక్కడ పరీక్షించిన వ్యక్తులే అక్కడ కూడా పరీక్షిస్తారన్నారు. తేమ శాతం తేడా రాకుండా చూస్తున్నామన్నారు. ధాన్యం సంచిలో తేడా వస్తే రైస్‌మిల్ వారే బాధ్యత వహించాలని, అందుకోసం మిల్లులే ప్రభుత్వ నుంచి మార్చుకోవచ్చు అన్నారు. అందుకోసం కలెక్టరేట్లో పదిమంది భిన్నమైన వారితో కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ మల్లేశ్వరరావు, డిఎస్ఒ సరోజ, వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ జెడ్ వెంకటేశ్వరరావు, కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు కనుమూరు అబ్బాయి రాజు, జనసేన నాయకులు జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్, బిజెపి మండల అధ్యక్షులు ముసునూరి నాగమణి, ఏడుకొండలు, గ్రామ ప్రముఖులు, రైతులు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనకు కార్యాచరణ రూపొందించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - మొగల్తూరు

జిల్లాలో ఉపాధి హామీ చట్టం ద్వారా పెద్ద ఎత్తున పని దినాల కల్పనకు కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతోందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం మండలంలోని వారతిప్ప మురుగు కాలువలో ఉపాధి కూలీలతో జరుగుతున్న కిక్కిస తొలగింపు పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్తర్ రిజిస్టర్‌ను పరిశీలించి ఎంత మంది హాజరయ్యారు, ఎన్ని రోజులు పని కల్పించారు, ఎన్ని గంటలకు పనికి హాజరవుతున్నారు, తదితర వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు కూలీలు మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేవని, వయస్సు కారణంగా వ్యవసాయ పనులు కూడా చేయలేకపోతున్నామని, ఉపాధి పనులు కల్పించడం వల్ల తమకు పని దొరుకుతోందని కలెక్టర్ వద్ద సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ కార్డు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పని కల్పించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. వారతిప్ప డ్రెయిన్‌లో కిక్కస తొలగింపు పనుల నిమిత్తం 537 పని దినాలను కల్పించడం జరిగిందన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా పని ప్రదేశాల్లో ఒఆర్ఎస్‌తోపాటు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. తాగునీరు, మజ్జిగ అందించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వారతిప్ప వాడకం నీటి చెరువును స్వయంగా పరిశీలించి ఎంపిడిఒతో మాట్లాడారు. వంతుల వారీ విధానం వల్ల నేటి నుండే నీటిని నింపుతామని తెలిపారు.

ముత్యాలపల్లిలో బిసి బాలికల హాస్టల్ పరిశీలన

ముత్యాలపల్లి బిసి బాలికల వసతి గృహం, ఎస్‌బిఎం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కలెక్టర్ చదలవాడ నాగరాణి తనిఖీ చేసి హాస్టల్‌లో చేపట్టి పూర్తిచేసిన పనులను పరిశీలించారు. పెండింగ్ పనులు ఉంటే చేయించాలని, నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకూ గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ ఫ్లోరింగ్ పనులను, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పనులను, పైప్ లైన్ లీకేజ్ పనులను పూర్తి చేయడం జరిగిందని హౌసింగ్ పీడీ జిల్లా కలెక్టర్‌కు వివరించారు.



మొగల్తూరు : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతరం హాస్టల్ విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో అన్ని పనులూ పూర్తి చేశామని, బాగా చదువుకుని విద్యలో రాణించాలని సూచించారు. అనంతరం హాస్టల్‌ను ఆనుకుని ఉన్న ఎస్‌బిఎం జెడ్‌పి హైస్కూల్‌ను పరిశీలించి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఎనిమిదో తరగతి నుండి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పదో తరగతి చదివే నాటికి మెరుగైన రీతిలో ఉంటారని కలెక్టర్ తెలిపారు.కలెక్టర్‌ను కలిసిన స్కూల్ కమిటీ సభ్యులు విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలం ఇబ్బందిగా ఉందని, స్కూలుకు ఉన్న మూడెకరాల స్థలంలో కొంత ఆక్రమణకు గురైందని, మిగతా స్థలాన్ని ఆటలకు అవకాశం కల్పించాలని విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రస్తుతం వినియోగంలో ఉన్న స్థలం, ఖాళీ స్థలం తదితర వివరాలను అందజేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, మొగల్తూరు తహశీల్దార్ కె.రాజ్‌కిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి జి.గణపతిరావు, హెచ్‌డబ్ల్యుఒ సిహెచ్ రామకళ్యాణి, పాఠశాల హెచ్‌ఎం పి.రామరాజు, సర్పంచి అడ్డాల సూరిబాబు, ఎంపీటీసీ తిరుమణి స్వామి ఉన్నారు.

నరసాపురం : వసతి గృహం విద్యార్థులకు మరింత శ్రద్ధగా విద్యనందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలం వలంధర రేవు హోలీల్యాండ్ సంక్షేమ బాలికల హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో డైనింగ్ ప్రదేశాన్ని, వసతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ చక్కగా చదువుకోవాలని, ధైర్యంగా ఉండాలని సూచించారు. నెలకు ఒకసారి వసతి గృహాన్ని తనిఖీ చేయాలని ఆర్‌డిఒకు సూచించారు. వసతి గృహం సూపరింటెండెంట్‌తో మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని, ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలిపారు.అలాగే నరసాపురం డంపింగ్ యార్డ్‌ను కలెక్టర్ నాగరాణి పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్తను మిషనరీ ద్వారా కంపోస్ట్‌గా తయారు చేసే యూనిట్ పరిశీలించి రోజుకి ఎన్ని టన్నుల చెత్తను కంపోస్ట్‌గా మారుస్తున్నారు. నిరంతర ప్రక్రియ జరుగుతుందా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. హోటల్స్, కళ్యాణ మండపాల నుంచి పెద్ద మొత్తంలో వచ్చే చెత్తను, తడి, పొడి చెత్తగా వేరు చేస్తే గాని సేకరించొద్దని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం రుస్తుంబాద లేస్ పార్కును కలెక్టర్ సందర్శించారు. తొలుత లేసు అల్లికదారులతో మాట్లాడుతూ లేసు ఉత్పత్తులను తయారుచేసి మార్కెటింగ్ పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లోనూ లేసు అల్లికను తెచ్చి పెట్టుకునే అంత నైపుణ్యతను చూపించాలని తెలిపారు. కలెక్టర్ వెంట కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, డిపిఒ అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య జిల్లా ఛైల్డ్ వెల్ఫేర్ అధికారి ఆర్.రాజేష్,పాజెక్ట్ అధికారి పి.మమత, డిప్యూటీ తహశీల్దార్ ఎన్ఎస్ఎస్‌వి.ప్రసాద్ ఉన్నారు.



నరసాపురం : డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపీమూర్తి




పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న గోపీమూర్తి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి అన్నారు. గురువారం మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో ఉన్న ఉపాధ్యాయులను కలసి తనని ఎన్నికలలో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన 11వ పిఆర్‌సి బాకాయిలు వెంటనే ఇవ్వాలని అన్నారు. సిపిఎస్ రద్దుపై జరుగుతున్న పోరాటంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు పాల్గొనాలని కోరారు. పేదవారికి విద్య దూరం కాకుండా తాను కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించాలని కౌన్సిల్ సమావేశాలలో ప్రభుత్వానికి వివరిస్తానని చెప్పారు. గణపవరంలో ఉన్న కాలేజీలు, హైస్కూల్స్ విద్యాజ్యోతి కాన్వెంట్‌లలో ఉన్న ఉపాధ్యాయులతో కలసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి వోతా ఆంజనేయులు, మండల కార్యదర్శి గొబ్బల భవానీప్రసాద్, అధ్యక్షులు బొడ్డు రమేష్ పాల్గొన్నారు.

ఎస్‌టిలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ప్రభుత్వ కాలనీలను పరిశీలించిన సిపిఎం బృందం



తణుకు : కాలనీ వాసులతో మాట్లాడుతున్న జెఎన్‌వి గోపాలన్

ప్రజాశక్తి - తణుకు

జిల్లాలోని ఎస్‌టిలైన యానాదులు, ఎరుకలు, చెంచులకు ప్రభుత్వమే ఇల్లు కట్టివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జయంతి కాలనీలో ఎస్‌టిలు నివసించే ఇళ్లను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78ఏళ్లు పూర్తి చేస్తుంటున్నా నేటికీ మైదాన ప్రాంత గిరిజనులైన ఎస్‌టిలు అభివృద్ధికి దూరంగానే ఉన్నారన్నారు. విద్యకు, వైద్యానికి నోచుకోలేని బతుకుల్లో మగ్గిపోతున్నారని వాపోయారు. పిల్లలు చదువులకు దూరమవుతున్నారని, యాచకులుగా, చెత్త ఏరుకునే వారిగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యానాదులు, ఎరుకలు, చెంచులకు ఆధార్ కార్డులు నమోదు చేసుకోవడానికి పుట్టిన తేదీ కోసం డబ్బులు తీసుకోవడం లేదా సర్టిఫికెట్ లేదు కాబట్టి చేయము అంటూ ఆధార్ సెంటర్‌లలో ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. తక్షణం జిల్లా అధికారులు ఆధార్ కార్డులు లేని ఎస్‌టిలకు ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులు పెట్టాలని డిమాండ్ చేశారు. 20ఏళ్ల నుంచి ఒకే గ్రామంలో ఉంటున్నా నేటికీ సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. ఎస్‌టిలకు ఇళ్ల స్థలాలు ఇస్తే సరిపోదని, వాటిని నిర్మించి కూడా ఇవ్వాలని గోపాలన్ డిమాండ్ చేశారు. ఎస్‌టిల అభివృద్ధికై సిపిఎం జిల్లా అధికార యంత్రాంగానికి సహకరిస్తుందని తెలిపారు. ఎస్‌టిల అభివృద్దే సిపిఎం ధ్యేయమని చెప్పారు. ఎస్‌టిల పిల్లలు చదువుకొనేలా వారికి చైతన్యాన్ని కల్పించామన్నారు. అవసరమైతే సిపిఎం ఆధ్వర్యంలో వారికి ట్యూషన్ సెంటర్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతి బాబు, పట్టణ కార్యదర్శి ఎ.అజయకుమారి, సీనియర్ నాయకులు గార రంగారావు, నాయకులు గోపీ, ఆదినారాయణబాబు, ఎస్‌టి నాయకులు కొండ పాల్గొన్నారు.



పాలకోడేరులో..

పాలకోడేరు:అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని పాలకోడేరు ఎఎస్ఆర్.నగర్ వాసులకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ భరోసా కల్పించారు. ఎఎస్ఆర్ కాలనీని సిపిఎం, ప్రజా సంఘాల నేతలు గురువారం సందర్శించి కాలనీ వాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అనేక సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు తమ ఇళ్లను తొలగించాలని నోటీసులు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వానికి అధికారులకు ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం జిల్లా కార్యదర్శి గోపాలన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి జిల్లా అంతటా ప్రజా చైతన్య సైకిల్ యాత్ర నిర్వహించడం జరిగిందని ఈ సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, దఫ దఫాలుగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకూ సిపిఎం పక్షాన అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి క్రాంతిబాబు ఉన్నారు.



పోడూరులో..

పోడూరు:పోడూరు ప్రభుత్వ కాలనీకి వెంటనే దారి ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. పోడూరు మండలం చంద్రరాజు చెరువుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ కాలనీకి దారి ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో స్థానికులు సిపిఎం బృందం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. సమస్యలపై ఇటీవల జిల్లా కలెక్టర్‌తో జరిగిన ప్రత్యేక సమావేశ విషయాలను పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబుతో కలిసి గురువారం కాలనీవాసులకు వివరించారు. ఈ సందర్భంగా చంద్రరాజు చెరువుకు ఆనుకొని ఉన్న కాలనీలో వెంటనే దారి ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ డిమాండ్ చేశారు. దారి నిర్మాణం విషయమై కలెక్టర్‌తో మాట్లాడామని, త్వరలోనే సమస్యను పరిశీలిస్తామని తెలిపారని చెప్పారు. దారి నిర్మాణం, పెండింగ్లో ఉన్న గృహ నిర్మాణం డబ్బులు వెంటనే విడుదల చేయాలని అధికారులతో కలెక్టర్ ఫోన్లో మాట్లాడారని తెలిపారు. దారి ఏర్పాటులో జాప్యం జరిగితే ఉద్యమం తప్పదని గోపాలన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు, పిల్లి ప్రసాద్, బూరాబత్తుల వెంకట్రావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ట్రిబ్యునల్ కేసుల పరిష్కారానికి చర్యలు

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

ట్రిబ్యునల్‌కు వచ్చే కేసులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ రెండవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ప్రతివారం జరిగే పిజిఆర్ఎస్‌కు సీనియర్ సిటిజన్స్ నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఎవరైనా వయోవృద్ధులు వారి పిల్లలతో వేధింపులకు గురైనట్లయితే వారు సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చున్నారు. వయోవృద్ధుల రక్షణ, పోషణ చట్టం ప్రకారం ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలోనూ కేసులు పరిష్కరించడానికి ట్రిబునల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీనియర్ సిటిజన్ యాక్ట్ అమలుపై విస్తృతంగా ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. ట్రిబునల్ పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించాలని, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రత్యేక బెడ్స్ ఏర్పాటు, ఆర్‌టిసి బస్సుల్లో వృద్ధులకు ప్రస్తుతం ఉన్న మూడు సీట్లు కాకుండా అదనంగా పెంచాలని వయోవృద్ధుల కమిటీ కోరింది. అనంతరం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అవగాహన వాల్ పోస్టర్‌ను డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్, డిఎస్‌పి ఆర్‌జి జయసూర్య, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ జి.గీతా బాయి పాల్గొన్నారు.

నాడు - నేడు అని ప్రజలే నిర్ధారించుకోండి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎంఎల్ఎ బొలిశెట్టి

తాడేపల్లిగూడెం : గత ప్రభుత్వం పరిపాలన నేటి ప్రభుత్వ పరిపాలన అనే విధంగా(నాడు- నేడు) ప్రజలే నిర్ధారించుకునే విధంగా పాలన సాగుతుందని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని మోదుగుంటలో కొమ్ముగూడెం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజుల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు నుంచి రోడ్ల పరిస్థితి వరకు అంతా సమీక్షించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, వారికి సకాలంలో సొమ్ములు వారి ఖాతాలకి జమచేసే విధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వారికి ఇష్టమైన రైస్ మిల్లుకు వారి ధాన్యాన్ని తోలుకునే విధంగా వ్యవస్థ రూపొందించామని, అంతా కూడా ట్రక్ షీట్ వేసే వరకు జాగ్రత్తగా ఉంటే ధాన్యం సొమ్ము వారి ఖాతాలకు త్వరగా జమవుతుందని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా రైతు భరోసా కేంద్రం వద్ద జిల్లా స్థాయి నుంచి కింద స్థాయి వరకు అందరి అధికారుల ఫోన్ నెంబర్లు ఉన్నాయని, వారికి మీ సమస్యలు తెలియజేసే అవకాశం ఉందని వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై విత్తనాలను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి జెడ్ వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ కతిబ్ కౌసర్ భాను, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శివప్రసాద్, సర్పంచి కట్టా సత్యవతి, జానకీరామ్, ఎడిఎ పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

'ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు తప్పనిసరి'

పెనుమంట్ర : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆరేళ్ల లోపు పిల్లలకి ఆధార్ నమోదు చేయించుకోవడం తప్పనిసరి అని పెనుమంట్ర ఎంపిడిఒ పి.సామ్యూల్ అన్నారు. గురువారం ఉదయం మండలంలోని జుత్తిగ, భట్ల మగటూరు, ఓడూరు గ్రామాల్లో ఆధార్ మొబైల్ సేవలు సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ ఆరేళ్ల లోపు పిల్లల జనన సర్టిఫికెట్‌తో ఆధార్ కేంద్రంలో నమోదు చేయించుకొని, ఆధార్ కార్డు పొందవచ్చని పేర్కొన్నారు. మండలంలో ఈనెల 4, 5 తేదీల్లో నత్తా రామేశ్వరం, వెలగలవారిపాలెం, సత్యవరం గ్రామాల్లో 8, 9 తేదీల్లో మాముడూరు, మల్లిపూడి, వెలగలేరు గ్రామాల్లో, 10, 11 తేదీల్లో పొలమూరు, ఎస్ఇ పర్రు, నెగ్గిపూడి గ్రామాల్లోని సచివాలయాల్లో మొబైల్ ఆధార్ సేవలు పొందాలని కోరారు.

90 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

పాలకొల్లు : పాలకొల్లు నియోజకవర్గానికి 90 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఆలపాటి రఘునాథ్ బాబు చెప్పారు. మంగళవారం ఆయన వివరాలను మీడియాకు విడుదల చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మంత్రి నిమ్మల రామానాయుడు లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసారని చెప్పారు. మంత్రి రామానాయుడు ఆదేశాలతో 24 గంటలు మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. యలమంచిలి మండలంలో 20 ట్రాన్స్‌ఫార్మర్లు, పూలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 35, పాలకొల్లు పట్టణ పరిధిలో 15, పోడూరు మండలంలోని 8 గ్రామాలకు 15 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనట్లు చెప్పారు. ఈవారంలో 25 ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభమవుతాయని అన్నారు. పాలకొల్లు పట్టణంలో 33/11కేవీ కొత్త సబ్‌స్టేషన్ రూ.3.5 కోట్ల ఖర్చుతో నిర్మాణం అవుతుందని 15 రోజుల్లో ఇది ప్రారంభం అవుతుందని అన్నారు. ఆగర్తిపాలెంలో ప్రస్తుతం ఉన్న 33/11పై 5 ఎంఎ ట్రాన్స్‌ఫార్మర్‌పై మరొక 5 ఎంఎ ట్రాన్స్‌ఫార్మర్ పెడుతున్నట్లు చెప్పారు. యలమంచిలి మండలంలోని కనకారలంక గ్రామంలో ఉన్న 11 కేవీ లైన్‌ను వరదలు వచ్చినా ఆటంకం కలగని విధంగా టవర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం : 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ హౌసింగ్ బోర్డు పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈమేరకు మెయిన్ రోడ్, నల్లజర్ల రోడ్, భూపాల్ నగర్, స్టేషన్ రోడ్, సిపాయి పేట, కోతి బొమ్మ సెంటర్, జూబ్లీ రోడ్, గణేష్ నగర్, కొండలమ్మగుడి రోడ్, పాలిటెక్నిక్ కాలేజ్ ఏరియా, హౌసింగ్ బోర్డు, శశి కాలేజ్ రోడ్, వీకర్స్ కాలనీ, ఎఫ్‌సిఐ కాలనీ, సత్యవతి నగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ఆర్‌డిఎస్ఎస్ వర్క్స్ నిమిత్తం పట్టణ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

నేడు ఎఎస్ఎన్ఎం కళాశాల వార్షికోత్సవం

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) 58వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి తెలిపారు. తమ కళాశాల 1968లో శ్రీఅద్దేపల్లి సత్యనారాయణ మూర్తి నెలకొల్పారని, వారి దాతృత్వంతో కళాశాల దినదిన ప్రవర్ధమానమై ఈరోజు పీజీ కోర్సులతో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా నిలిచి విద్యార్థుల ఉన్నతశిఖరాలకు వారధిగా నిలిచిందని చెప్పారు. అటువంటి కళాశాల 58వ వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకలకు గౌరవ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, రాజమండ్రి డాక్టర్ ఎస్.శోభారాణి హాజరవుతున్నారన్నారు. ఈ వేడుకలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులందరూ హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి కోరారు.

స్వర్ణాంధ్ర లక్ష్యంగా కృషి చేయాలి : ఎంఎల్ఎ

తణుకు : స్వర్ణాంధ్ర లక్ష్యంగా విజన్ 2047 సాధించే దిశగా ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం తణుకు నియోజకవర్గ స్థాయి విజన్ యాక్షన్ ప్లాన్ 2047 యూనిట్ సమావేశాన్ని తణుకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పి-4 విధానంలో అభివృద్ధి పనులు చేపట్టి తద్వారా ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించడం, వారి తలసరి ఆదాయం పెరిగే దిశగా కృషిచేస్తుందన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కౌసర్‌భానో, తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు భద్రాచలానికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు

నరసాపురం : శ్రీరామనవమి సందర్భంగా నరసాపురం డిపో నుంచి భద్రాచలం రామాలయానికి వెళ్లడానికి ఈనెల 5వ తేదీన ఎక్స్‌ప్రెస్ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. నరసాపురం నుంచి పాలకొల్లు, మార్టేరు, పెనుగొండ, తణుకు, తాడేపల్లిగూడెం, ద్వారకాతిరుమల, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట, కుక్కునూరు మీదగా భద్రాచలం వెళ్తుందన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నర్సాపురం-వైజాగ్ రైలును పునరుద్ధరించాలి

పాలకొల్లు : గతంలో ఉండే నర్సాపురం-వైజాగ్ రైలు, నరసాపురం నుంచి బెంగళూరుకు వారంకు ఒకరోజు వెళ్లే రైలు రెగ్యులర్ చేయాలని జెడ్ఆర్‌యుసిసి మెంబర్ కోరం రామ్మూర్తి, డిఆర్‌యుసిసి మెంబర్ జక్కంపూడి కుమార్ కోరారు. విజయవాడలో సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర పటేల్‌ని గురువారం కలిసి రైల్వే అభివృద్ధి పనులపై చర్చించారు. వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్, బెంగుళూరులకు ప్రత్యేక రైళ్లను నడపాలని కోరారు.

16కెవి ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పాలకొల్లు రూరల్: పాలకొల్లు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం 9 నెలల పాలనలో 90 విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను మంత్రి రామానాయుడు మంజూరు చేయించారని, దీర్ఘకాలికంగా వేదిస్తున్న విద్యుత్ బాధలు తీరబోతున్నాయని టిడిపి మండల అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో విద్యుత్ సమస్యలను పట్టించుకున్న నాధుడే లేడని ఆరోపించారు. పాలకొల్లు మండలం ఆగరు గ్రామంలో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎలక్ట్రికల్ ఎఇ శ్రీనివాసు, ఎంఆర్‌ఒ యడ్ల దుర్గా కిషోర్, పెనుమత్స శ్రీనివాసరాజు, గాదిరాజు అర్జున్ రాజు, సాగ సువర్రాజు పాల్గొన్నారు.

వీర పేరంటాలమ్మ సన్నిధిలో డిప్యూటీ స్పీకర్

ఉండి: వెలివర్రు గ్రామదేవత వీర పేరంటాలమ్మ అమ్మవారిని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు గురువారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను రఘురామకృష్ణంరాజు సన్మానించి, నిప్పులగుండం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పెన్మెత్స అంజనీదేవి, ఆలయ కమిటీ చైర్మన్ గాదిరాజు వెంకట్రాజు, మాజీ చైర్మన్లు కల్లేపల్లి సతీష్ రాజు, ముదునూరి రంగరాజు, మంతెన రంగరాజు ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డ్వాక్రా మహిళలకు బ్యాంకు రుణాలు

డ్వాక్రా ఎపిఎం పి.పద్మ



ప్రజాశక్తి - పెనుమంట్ర

మహిళలు తమ డ్వాక్రా సంఘాల్లో చేసుకొనే పొదుపు మొత్తాలకు అనుగుణంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని డ్వాక్రా ఎపిఎం పి.పద్మ అన్నారు. దీనికి సంబంధించి ఆమె ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి? మొత్తంగా డ్వాక్రా సంఘాలు ఎన్ని ఉన్నాయి?

ఎపిఎం : మండలంలో గ్రామాలు 18. ఈ గ్రామాలు అన్నింటిలో 1,374 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి.

ప్రశ్న : మీ సంస్థలో ఎంతమంది ఫీల్డ్ స్టాఫ్ పనిచేస్తున్నారు?

ఎపిఎం : మండలంలో మొత్తం 32 గ్రామ సంఘాలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 29 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. జుత్తిగలో ఒకటి, నత్తారామేశ్వరంలో రెండు ఖాళీలు ఉన్నాయి. త్వరలో అక్కడ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌లను నియమిస్తాము.

ప్రశ్న : డ్వాక్రా సంఘాల రెగ్యులర్ కార్యక్రమాలు ఎలా ఉంటాయి?

ఎపిఎం : మహిళలు డ్వాక్రా సంఘంగా ఏర్పడిన తర్వాత 6 నుంచి 12 నెలల్లో వారు చేసుకున్న పొదుపు బట్టి బ్యాంకులు నాలుగు నుంచి 10 రెట్లు రుణాలు అందిస్తాయి. వాటిని తిరిగి చెల్లించి, కొత్తగా రుణాలు పొందుతున్నాయి.

ప్రశ్న : డ్వాక్రా సంఘాలలోని మహిళలకు ఆర్థిక ప్రగతికి మీరు చేసే మోటివేషన్ ఎలా ఉంటుంది?

ఎపిఎం : సంఘాల్లో కనీసం డిగ్రీ చదివి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఆరుగురు మహిళలను సిఆర్‌పిలుగా గుర్తించి, వారి ద్వారా సంఘాల్లో అవగాహన కలిగిస్తున్నాము. ప్రస్తుతం ఒన్ స్టాఫ్ ఫెసిలిటీ సెంటర్లుగా పెనుమంట్ర, ఇరగవరం మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌లుగా ఇవి నడుస్తున్నాయి.

ప్రశ్న : మీ డ్వాక్రా సంఘాలు చేసే వ్యాపార కార్యకలాపాలు?

ఎపిఎం : చాలా సంఘాలు గృహ ఉత్పత్తులు, నిల్వ వెజ్, నాన్ వెజ్ పచ్చళ్లు, అప్పడాలు, వడియాలు, పూతరేకులు, పొడులతో పాటు కంప్యూటర్ మీద మగ్గం పనులు చేస్తున్నారు. కొందరు వస్త్రాలు, ఫర్నిచర్, కిరాణా, కూరగాయలు, పండ్లు, ఫాన్సీ, జెరాక్స్, బ్యూటీ పార్లర్ వ్యాపారాలు నిర్వహిస్తారు.

ప్రశ్న : వారి అదాయాలు ఎలా ఉంటాయి?

ఎపిఎం : వ్యాపారంలో వారి గృహ అవసరాలకుపోను, బ్యాంకు రుణం చెల్లించాలి. ఇలా చూసుకుంటే నెలకు రూ.20 వేల నుంచి లక్ష వరకు ఆదాయం పొందే వారు ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ కొన్ని సంఘాలు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టి మంచి ఆర్డర్లు పొందుతున్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

హైస్కూల్లో మొక్కలు నాటిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని మార్చిలో ఉద్యోగ విరమణ చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలుగజేస్తాయని, పాఠశాల పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దుతాయని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేపాక వెంకన్న బాబు, జి.నర్మద, ఎంవి.శ్రీలక్ష్మి, కె.రాజేష్ కుమార్ రాజు, బి.రత్నకుమారి, డి.కనకరత్నం, సిహెచ్.జలాబాయి, వై.శకుంతల, ఎం.బాల పల్లాల రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులు వినియోగించుకోవాలి : ఎంపిడిఒ

గణపవరం : మండలంలోని 25 గ్రామాల్లో ఆధార్ క్యాంపులు ఈనెల 3వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు ఏర్పాటు చేస్తున్నట్లు గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి గురువారం చెప్పారు. ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో, 8, 9, 10, 11 తేదీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపులు స్థానిక అంగన్వాడీ కేంద్రాల వద్ద నిర్వహిస్తామని అన్నారు. అయిదు సంవత్సరాల పిల్లలు, విద్యార్థులు, ప్రజలు క్యాంపులను ఉపయోగించుకోవాలని కోరారు.

అన్నదానానికి దాతల సహకారం అభినందనీయం : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం : బలుసులమ్మ అన్నదానానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయం ఉగాది ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం నిర్వహించే అన్నదానానికి జనసేన నాయకులు, వీర మహిళలు అందించిన 1090 కేజీల బియ్యాన్ని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం రామాంజనేయులు (అంజి)కి అందించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదానానికి భక్తులు భారీగా హాజరవుతున్నారని అన్నారు. దీనికి దాతల సహకారం కూడా బాగుందని కితాబిచ్చారు. జనసేన నాయకులు, సైనికులు, వీర మహిళలు, వీరి స్నేహితులు రాజకీయాల్లోనే కాకుండా ఆధ్యాత్మికంగా కూడా ముందుంటారని నిరూపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఆలయ నిర్వహకులు శ్రీరంగం అంజి, నీలం సురేష్ పాల్గొన్నారు.

7 నుంచి అడ్మిషన్లు ప్రారంభం

వీరవాసరం : ఈనెల 7 నుంచి వీరవాసరం విఇసి జూనియర్ కళాశాల అడ్మిషన్‌లు ప్రారంభమవుతాయని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సిహెచ్.ప్రభువరం గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్య పుస్తకాలను రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అందజేసినట్టు తెలిపారు. ఈనెల ఒకటవ తేదీ నుంచి రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వీరికి మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంపన సాయిబాబా, ఎన్.సురేష్, బలరాం, నాగమణి, శాంతారామ్, అడ్డాల కృష్ణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



రెడ్‌బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి కార్మికులు


ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎన్ఎంయు(ఎ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ఆర్‌టిసి తాడేపల్లిగూడెం డిపో ఆవరణలో కార్మికులు మొదటి డ్యూటీ నుంచి రెడ్ బ్యాడ్జిస్ ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. 2019 సర్కులర్ కచ్చితంగా అమలు చేయాలని, నైట్‌అవుట్ అలవెన్స్ రూ.300 చేయాలని, హయ్యర్ పెన్షన్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లీవ్ ఎన్కేష్మెంట్ వెంటనే మంజూరు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ కొనుగోలు చేయాలని ఎండికి వినతిని అందజేశారు. పెండింగులో ఉన్న అనేక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎర్ర బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరై, పెద్దఎత్తున నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి కె.రవికుమార్, డిపో ప్రెసిడెంట్ ఎం.శరత్‌బాబు, డిపో ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రవిశంకర్, డిపో సిసిఎస్ డెలికేట్ పి.కొండలరావు, వానపల్లి అప్పారావు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

పిఎస్ఆర్ శాస్త్రి అభినందనీయులు

ఉద్యోగ విరమణ సభలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి



శాస్త్రి దంపతుల్ని సత్కరిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణ ప్రణాళిక విభాగంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్‌గా పనిచేసిన పెండ్యాల శివరామశాస్త్రి(పిఎస్ఆర్.శాస్త్రి) విజయవంతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని ఆయన సూపర్ మాన్ అని భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ చెందిన పిఎస్ఆర్ శాస్త్రికి బుధవారం రాత్రి మున్సిపల్ కార్యాలయం హాల్లో సత్కారం, వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్ట్రీ రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సుదా బత్తుల కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమిషనర్ రామచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ శాస్త్రి దంపతుల జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఇంజనీర్ త్రినాధరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సిహెచ్.పార్థసారథి, బాలాజీ, గత ఉద్యోగులు రాజేంద్ర ,మాజీ కౌన్సిలర్ కృష్ణంరాజు, ఎస్‌బిఐ రిటైర్డ్ మేనేజర్ సుబ్బారావు సర్వేయర్ రమా శాస్త్రి భీమవరం అభివృద్ధికి చేసిన సేవలను గురించి ప్రశంసించారు. 36 సంవత్సరాలకుపైగా తన విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ఇతరులకు శాస్త్రి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిఎస్ఆర్ శాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అల్లూరి శ్రీనివాసరాజు, ఎఇ కొప్పినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని రికార్డ్ స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నవాబుపాలెం, జగన్నాథపురం, మాధవరం, అప్పారావుపేట, మెట్ట ఉప్పరగూడెం, ఉప్పరగూడెం తదితర గ్రామాల్లో ఇటీవల నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, బీటి రోడ్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గం రోడ్ల నిర్మాణంతో పాటు చెరువులు, క్రికెట్ స్టేడియం ఏర్పాటు, గతంలో నిలిచిపోయిన భవనాల పునర్నిర్మాణ పనులను చేస్తూ ప్రజలకు అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నేత నియోజకవర్గంలో ఏదో జరిగిపోతుందంటూ అవాస్తవాలు చెబుతూ రోజుకో ప్రెస్‌మీట్ నిర్వహిస్తూ బొంకడమే పనిగా పెట్టుకున్నారన్నారు. తాను ఏం చేస్తున్నాను? అభివృద్ధి విషయంలో ఎలా ఉంటున్నాను? అవినీతి చేస్తున్నానో లేదో అందరికీ తెలుసు అన్నారు. నియోజకవర్గంలో 24 మర్డర్లు ఎక్కడ జరిగాయో వివరించాల్సిన బాధ్యత కొట్టు సత్యనారాయణపై ఉందని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారని, ఎక్కడ ఏ పని జరగాలన్నా ప్రజల సహకారం కోరుతూ ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ముందుకు సాగుతున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఈవిధంగా పనిచేస్తే నిధులు కూడా వాటి అంతటవే వస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్, సర్పంచులు ముప్పిడి సూర్యకుమారి, ఉంద్రాజవరపు చంద్రిక, మద్దుకూరి గంగాభవాని, ఆరుగొలను శ్రీనివాస్, దండే కనకబాబు, టిడిపి నాయకులు వాడపల్లి వెంకట సుబ్బరాజు, నీటిసంఘం అధ్యక్షుడు గంధం ఏడుకొండలు, అడ్డగర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన



యలమంచిలి : అవగాహనా ర్యాలీలో పాల్గొన్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - యలమంచిలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా 2వ విడతలో గుంపర్రు గ్రామం ఎంపికైన నేపథ్యంలో రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం గ్రామంలో గ్రామ సభతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొని నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారికి ఈ రీ సర్వే అంటే ఏమిటి దాని వల్ల వారికి కలుగు లబ్ధి గురించి కూలంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.పవన్ కుమార్, గ్రామ సర్పంచి తుంగా అమూల్య, టిడిపి నాయకులు ఈతకోట శేషగిరిరావు, నాయకులు జె.రామకృష్ణ, చేగొండి వెంకటేశ్వరరావు, సిహెచ్.ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్ పి.డేవిడ్ సన్, కౌరు యశోద, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, యలమంచిలి, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పాలకోడేరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వివిధ రకాల సర్వేలను ప్రారంభించిందని, వీటన్నిటిని సకాలంలో పూర్తి చేయాలని ఎంపిడిఒ వి.రెడ్డియ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో గురువారం సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పి-4 సర్వేను సమర్థవంతంగా పూర్తిచేయడం జరిగిందని, మిగిలిన సర్వేలను అదే స్ఫూర్తితో పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సర్వేల పట్ల బాధ్యతతో ఉండాలన్నారు. కొంతమంది సచివాలయ ఉద్యోగులు కనీసం రిజిస్టర్‌లో సంతకాలు కూడా చేయట్లేదని ఇది సరైంది కాదన్నారు. అలాగే సెలవు పెట్టాలనుకునేవారు ముందుగా అనుమతి తీసుకోవాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల విస్తరణ అధికారి రాంప్రసాద్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : గ్రామంలో అధికారులు సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు రైతులు వారికి సహకరించాలని తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని ఐ భీమవరం గ్రామంలో గురువారం సాయంకాలం రీసర్వే సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో అనేక సమస్యలు వచ్చినందువల్ల ప్రభుత్వం తిరిగి రీసర్వే నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. ప్రతి రైతు తమ భూముల్లో తప్పులను సరిచూసుకోవాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క రైతుకి అధికారులు నోటీసులు అందజేస్తారని, ఆ నోటీసులు అందరూ తీసుకోవాలని ఆమేరకు హాజరు కావాలని ఆయన కోరారు. మరో సర్వే పైలట్ గ్రామం దుంపగడపలో శుక్రవారం సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో రైతులు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి కనుమూరు రామకృష్ణంరాజు, త్రిమూర్తి రాజు, సత్యనారాయణ రాజు, గాంధీరాజు పెద్దిరాజు, ఆర్ఐ వి.ఆంజనేయులు, విఆర్‌ఒ దాలయ్య పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న చౌక డిపోలను తహశీల్దార్ తనిఖీ చేశారు. పలువురు గ్రామస్తులను అడిగి పౌర సరఫరాల పరిస్థితిని తెలుసుకున్నారు.

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వేను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. గురువారం మండలంలోని మహదేవపట్నంలో గ్రామ రెవెన్యూ అధికారి సైలాడ చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభను ఉద్దేశించి నాగార్జున మాట్లాడుతూ రీ సర్వే నిర్వహించే సమయంలో ప్రజలు వారి పత్రాలను అధికారులకు చూపించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని వారు సూచించారు.

ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు కేటాయించాలి

పోడూరు : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు ఎక్కువ రోజులు పనులు చూపించాలంటే బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. పోడూరు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రాంతంలో వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యంత్రాలు, ఆక్వా, ఇతర ప్రాంత కూలీలు రావడం వాణిజ్య పంటలు పెరగడం ఫలితంగా గ్రామాల్లో కూలీలకు పనులు లేకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం కూలీలకు ఉపాధి కల్పిస్తున్నది నాడు పార్లమెంట్లో పోరాడి తెచ్చుకున్న ఉపాధి హామీ చట్టం అన్నారు. దీనిని రక్షించుకోవాల్సిన బాధ్యత మన కూలీల అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, క్రాంతి బాబులు మాట్లాడుతూ కరోనా సమయంలో కూలీల ప్రాణాలు కాపాడింది ఉపాధి హామీ పని ఉండటమే అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పట్టిష్టంగా అమలు చేయాలని వారు కోరారు.

'నోట్ల జారీలో ఆర్‌బిఐ గుత్తాధిపత్యం'

భీమవరం టౌన్ : తొంభై సంవత్సరాల క్రితం భారతదేశ ద్రవ్య ఆర్థిక స్థిరత్వానికి సంరక్షకునిగా పని చేయడానికి ఆర్‌బిఐ స్థాపించబడిందని, ఈ తొమ్మిది దశాబ్దాలుగా మారుతున్న ఆర్థిక ద్రవ్యానికి అనుగుణంగా అభివృద్ధి చెందిందని భీమవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎం.నిర్మల జ్యోతి అన్నారు. గురువారం భీమవరం యూనియన్ బ్యాంక్‌లో రిజర్వ్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్మల జ్యోతి మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి అవసరమైన ప్రతిదాన్ని ఆర్‌బిఐ చేస్తుందని అన్నారు. అనంతరం 27 మంది విద్యార్థులకు బ్యాంక్ విధి విధానాలపై పోటీలను నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, జనార్ధనవరం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం./2025 తేది.03-04-2025

ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం, జనార్ధనవరం గ్రామపంచాయితీ పరిధిలో 2025-2026 ఆర్థిక సం॥రం లో పని చేయుటకు టెండర్ల ద్వారా నియమించటం జరుగుతుంది. ఈ టెండర్లు ది.10-04-2025 తేదీన గ్రామ పంచాయితీ కార్యాలయంలో మధ్యాహ్నం 2.00 గంటలకు గ్రామపంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, (లేదా) వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడి, హాజరైన టెండరుదారుల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును. టెండరు షరతులు మిగిలిన విషయములు కార్యాలయము పనిచేయు వేళలందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనివివరము	కాలపరిమితి
1	మంచినీటి ట్యాంక్ ఆపరేటర్ - 1	1-4-2025 నుండి 31-3-2026 వరకు
2	వీధి దీపాల నిర్వహణ - 1	1-4-2025 నుండి 31-3-2026 వరకు
3	పారిశుద్ధ్య పనుల నిర్వహణ - 3	1-4-2025 నుండి 31-3-2026 వరకు
4	మోటార్ మెకానిక్ - 1	1-4-2025 నుండి 31-3-2026 వరకు

గమనిక: 1) గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) గ్రామ పంచాయితీ నిధులను బట్టి చెల్లింపులు జరుపబడును. 3) టెండర్లు నిర్వహించుటకు (లేదా) రద్దుచేయుటకు గ్రామపంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

సం/- పామర్తి ఝాన్సీరాణి
సర్పంచ్, జనార్ధనవరం గ్రామపంచాయితీ
చాట్రాయి మండలం, ఏలూరు జిల్లా.

సం/- హరి హనుమంతరావు
గ్రామపంచాయితీ కార్యదర్శి, జనార్ధనవరం
చాట్రాయి మండలం, ఏలూరు జిల్లా.

ఆక్వా సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

ఆక్వాసాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి కలెక్టరేట్లో మత్స్యశాఖపై సంబంధిత శాఖాధికారులతో ఆయన సమీక్షించారు. ఆక్వాసాగులో రైతులు అనుసరిస్తున్న సాంకేతిక పద్ధతులు, వినియోగిస్తున్న నూతన యంత్రాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆక్వా ఎక్స్చేంజ్, కౌంట్ 366 సంస్థలు ఉపయోగిస్తున్న అధునాతన పరికరాలైన పవర్ మాన్, స్టార్టర్స్, ఆక్వా బోర్డ్స్ వాటి నిర్వహణ గురించి ఆసంస్థ ప్రతినిధులు, మత్స్యశాఖ అధికారులకు వివరించారు. మత్స్యశాఖ అధికారులు ఆయా పరికరాలు వాడుతున్న రైతుల వివరాలు సేకరించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని జెసికు సూచించారు. బయోఫ్లాక్ పద్ధతిలో నర్సరీలు ఏర్పాటు చేసుకొని రొయ్యల సాగు పద్ధతులు తెలుసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో వాడుతున్న యంత్రాల గురించి వివరాలు సేకరించాలన్నారు. యంత్ర పరికరాలు వాడటం వల్ల విద్యుత్ ఆదాపై జిల్లాలో పది మంది రైతులు మీద పరిశీలన చేసి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఆక్వాసాగు 1,33,037 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, అయితే కేవలం 50,732 ఎకరాలు మాత్రమే ప్రభుత్వం రిజిస్టర్‌లో నమోదైందన్నారు. మిగిలిన 80 వేల ఎకరాలను మత్స్యశాఖ అధికారులు రిజిస్టర్ చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్.ప్రసాద్, మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఎల్ఎన్‌డి.రాజు, సిహెచ్.వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MARRAPU DHANNJAYARAO Son of MARRAPU APPALA SWAMY, R/o D.No.5-129, Kamakshamma Temple, Eluru Mandal, Ponangi, West Godavari District changed my name MARRAPU DHANNJAYARAO (old name) to MARRAPU DHANAMJAYA RAO (new name) same as intimated to genral Public

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో

I.P.No. 11/2025

Between:
Adabala Manikanta ...Petitioner/Debtor
AND
Atragadda Jyothi & 40 others ...Respondents/Creditors

DESCRIPTION OF THE PETITIONER/DEBTOR:
1) Sri Adabala Manikanta, Tadepalligudem

DESCRIPTION OF THE RESPONDENTS/CREDITORS:
1) Atragadda Jyothi, Tadepalligudem,
2) Tadi Narasimha Murthy, Tadepalligudem
3) Rudra Ratnaji, Tadepalligudem
4) Arjula Arun Kishore, Tadepalligudem
5) Guna Ayyapa, Tadepalligudem
6) Pasupuleti Veera Swamy, Tadepalligudem
7) Achanta Pallavi, Tadepalligudem
8) Dodla Chinna Balaji, Tadepalligudem
9) Kamisetti Srinivas, Tadepalligudem
10) Yalla Satyanarayana (Babu),
11) Bodapati Murali Krishna, Tadepalligudem
12) Jaggam Setti Nagi reddy, Ravulapalem Village and Mandal
13) Padala Rama Chandra Reddy, Ravulapalem (V) & (M)
14) Revuri Veera Venkata Satyanarayana Reddy, Ravulapalem (V) & (M)
15) Padala Venkateswararao, Ravulapalem Village and Mandal
16) Bhimi Reddy Satti Reddy, Ravulapalem Village and Mandal
17) Tatipaka Sri Harsha, Ravulapalem Village and Mandal
18) Vanapalli Raju, Ravulapalem Village and Mandal
19) Balireddy Srinivasararao, Ravulapalem Village and Mandal
20) Chippada Anil Kumar, Tadepalligudem
21) Polisetti Chandra SK Swamy Naidu, Ravulapalem Village and Mandal
22) Yogi Hanumanth Sai Nambula, Tadepalligudem
23) Karri Siva Reddy, Ravulapalem Village and Mandal
24) Anipireddy Bhaskar Rao, Ravulapalem Village and Mandal
25) Padala Ramachandra Rao, Ravulapalem Village and Mandal
26) Kurri Srinivas, Ravulapalem Village and Mandal
27) Kapaganti Subrahmanyam, Ganapavaram Mandal
28) Padala Satish Kumar Reddy, Rajahmundry Town and Mandal
29) Maddipatla Maha Naga Satyanarayana, Tadepalligudem
30) Kommula Rama Krishna,Tanuku
31) Dwarapudi Subhakar Reddy, Bikkovole Mandal
32) Katari Ashok Kumar Reddy, Ravulapalem Village and Mandal
33) Mutta Durga Rao, Mettauppergudem
34) Venkata Reddy Padala, Ravulapalem Village and Mandal
35) Midde Rajesh, Denduluru Mandal, Eluru
36) Yeedupuganti Suresh, Duvva, Tanuku Mandal
37) Dusanapudi Vijay, Tadepalligudem
38) Vasa Harinadh, Tadepalligudem
39) Midde Srikanth, Pothunuru, Denduluru Mandal, Eluru
40) Merupo Rahul Lal, Tadepalligudem,
41) The official receiver, Eluru, West Godavari district

Petitioner (పిటిషనర్)/Debtor (రుణగ్రహీత) తరపున దాఖలు చేసిన పత్రిక ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ వ్యాపారంలో నష్టపోయిన కారణంగా ఎవరికి డబ్బులు చెల్లించలేని పరిస్థితుల కారణంగా పై నెంబర్ గల I.P దావాను తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో వేసినారు. దావాలో రెస్పాండెంట్స్ (క్రెడిటర్స్)/ప్రతివాదులుకు శ్రీ గౌరవనీయులైన కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం పత్రిక ప్రకటన ద్వారా సబ్ స్టిట్యూట్ సర్వీస్ నిమిత్తం కోర్ట్ వారు ఉత్తర్వులు జారీ చేసినారు. మీరు **ది. 21-04-2025 వ తేది ఉదయం గం. 10-30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై స్వయముగా కాని, న్యాయవాది ద్వారా కాని మీ యొక్క ఆక్షేపణలను తెలియజేసికోవలను. లేనియెడల సదరు నెంబరు I.P దావా న్యాయస్థానం వారు మీ పరోక్షమున తీర్మాణించెదరు అని తెలియజేయడమైనది.

(By order of the Hon' ble court)

M. YESUPADAM, M.A.BL
M.B.AVINASH, LLM
ADVOCATES
TADEPALLIGUDEM
TADEPALLIGUDEM
Dt: 03-04-2025
CELL NO. 7396446127, 7893674560